
సాక్షి తూర్పుగోదావరి

గురువారం | 21 | మార్చి | 2024



రూ.1,01,115 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కాకర్ల వేంకటరమణ, విజయలక్ష్మి దంపతులు (త్యాగంపూడి) రూ.1,01,115 విరాళాన్ని బుధవారం సమర్పించారు.



డెల్టాకు 8,970 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.45 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురు (సా॥)	సెహరీ శుక్ర (ఉ॥)
రాజమహేంద్రవరం	6.23	4.45
కాకినాడ	6.23	4.45
అమలాపురం	6.23	4.45

న్యూస్‌రీల్

జిల్లాలో తేలికపాటి వర్షం

సాక్షి, రాజమహేంద్రవరం: జార్ఖండ్ నుంచి కోస్తా ఒడిశా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో బుధవారం తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షం కురిసింది. వర్షం ప్రభావంతో జిల్లాలో వాతావరణం చల్లబడింది. నిన్నటి వరకు వేడి తీవ్రత ఎక్కువగా ఉన్న వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. బుధవారం ఉదయం పొడి వాతావరణం నెలకొంది. సాయంత్రం ఒక్కసారిగా రాజమహేంద్రవరం నగరంలో చిరుజల్లులు కురిశాయి. ఉత్తరాంధ్ర జిల్లాలకు వర్ష ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. ద్రోణి ప్రభావంతో గురువారం జిల్లాలో ఓ మోస్తరు వర్షం నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. జిల్లాలో నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. గోపాలపురంలో కనీసం చుక్కకూడా కురవలేదు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, బూరుగుపూడి తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సుమారు అరగంట పాటు స్తంభించింది. అనపర్తి నియోజకవర్గం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇన్నాళ్లూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు వర్షం కాస్త సాంత్వన చేకూర్చింది. మరో రెండు రోజుల పాటు పొడి వాతావరణమే కొనసాగనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడిస్తోంది.

హోమానికి రూ.లక్ష విరాళం



స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి రాజోలు మండలం కడలికి చెందిన ఇలపకుర్తి సుబ్రహ్మణ్యం, శశికళ దంపతులు రూ.లక్ష విరాళం సమర్పించారు. ఆ మొత్తాన్ని బుధవారం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సిబ్బంది అందించారు.

పాదగయ హుండీ ఆదాయం రూ.24.56 లక్షలు



హుండీలలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది

పిఠాపురం: పాదగయ క్షేత్రం హుండీ ఆదాయం రూ.24,56,485 సమకూరినట్లు ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. బుధవారం పెద్దాపురం మరిడమ్మ ఆలయ ఈఓ సీహెచ్ రామ్మోహనరావు, సామర్లకోట భీమేశ్వరస్వామి వారి ఆలయ ఈఓ నీలకంఠం దేవదాయశాఖ తనిఖీ అధికారి వి.ఫణికుమార్‌ల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కించినట్లు ఆయన తెలిపారు. 92 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. లెక్కింపులో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇస్రో స్పేస్ ట్యూటర్ ప్రోగ్రాంకు స్పార్క్



సాయిసందీప్‌ను సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

ఏలేశ్వరం: ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)కు సేవలందిండానికి స్పార్క్ సంస్థ ఎంపికైనట్టు చైర్మన్ సాయిసందీప్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఇస్రో స్పేస్ ట్యూటర్ ప్రోగ్రాంకు రాష్ట్రంలో తొలిసారిగా తమ సంస్థ ఎంపికైనట్టు ఆయన తెలిపారు. పట్టణానికి చెందిన స్పార్క్ సంస్థ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు అంతరిక్షం, ఇస్రో సేవలపై అవగాహన కల్పిస్తుంది. ప్రత్యేక సెమినార్లు నిర్వహించి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తుంది. శాస్త్ర, సాంకేతిక అంతరిక్ష విజ్ఞాన రంగంలో విద్యార్థులకు మార్గదర్శకం చేయగల అంతరిక్ష విద్యార్థుల సమూహాన్ని సృష్టించడం ఇస్రో లక్ష్యంగా పెట్టుకొంది. ఈ నేపథ్యంలో స్పార్క్‌ను ఎంపిక చేసింది. కాకినాడలో ఎస్పీ సతీష్‌కుమార్ చేతులమీదుగా సాయిసందీప్‌ను సన్మానించారు. ఇస్రోకు ఎంపికైన పత్రం ఎస్పీచేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సందీప్‌ను పలువురు అభినందించారు.

యాప్‌రిమిత సేవలు

- పౌరుల కోసం ..స్మార్ట్ సైన్యం
- ఒక్కో పనికి...ఒక్కో యాప్
- ఓటర్లకు సమస్త సమాచారం
- ఓటు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం
- అందుబాటులో అభ్యర్థుల బయోడేటా
- వివాదాలను చిత్రీకరించి ఈసీకి ఫిర్యాదు చేసే సౌలభ్యం
- పార్టీ అభ్యర్థుల అనుమతుల కోసం సువిధ యాప్



రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల భాగస్వామ్యానికి కీలకంగా ఉండే యాప్‌లను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అందుబాటులోకి తెచ్చింది. సజావుగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ, జవాబుదారీతనం కోసం అధికారిక యాప్‌లను రూపొందించింది. ఓటు నమోదు, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశంతో పాటు పోటీల్లో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థుల పూర్తి బయోడేటాను ప్రజలు తెలుసుకునే అవకాశాన్ని ఈ-యాప్‌ల ద్వారా ఈసీ కల్పించింది. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉండే ఓటరు సౌలభ్యం కోసం మరెన్నో సులభతరమైన ఆప్షన్లను యాప్‌లో పొందుపర్చారు. ప్రస్తుత డిజిటల్ యుద్ధంలో వేగవంతమైన ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో 60 శాతానికి పైగా ప్రజలకు స్మార్ట్‌ఫోన్ సౌకర్యం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మల్టీపుల్ ఆప్షన్లతో యాప్‌లను ఈసీ సిద్ధం చేసింది.

సమగ్ర సమాచారం: ఓటరు హెల్ప్‌లైన్ యాప్

ఓటరు సంబంధిత సేవలను యాక్సెస్ చేసేందుకు విప్లవాత్మక మార్పులను ఈ యాప్‌లో పొందుపర్చారు. ఎన్నికలకు సంబంధించిన సేవలను పొందేందుకు ప్రజలకు అనుసంధానకర్తగా ఈ యాప్ ద్వారా ఈసీఐ వ్యవహరిస్తుంది. దీనిలో కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చు. ఓటును సవరించుకోవచ్చు. డిజిటల్ ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలోని జనాభా, ఇతరుల పేర్ల వివరాలను తెలుసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన తాజా సంక్షిప్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఫిర్యాదులు చేయవచ్చు.

అభ్యర్థుల చిట్టా: కేవైసీ యాప్

ఈ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం సొంతంగా అభివృద్ధి చేసింది. దీనిలో పోటీల్లో ఉన్న రాజకీయ పార్టీ అభ్యర్థుల వివరాలన్నీ ఉంటాయి. పోటీ చేసే అభ్యర్థుల నేరచరిత్రను పౌరులు తెలుసుకునేందుకు దోహదపడుతుంది. అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులను బహిర్గతం చేస్తుంది. అభ్యర్థులపై వచ్చిన నేర ఆరోపణలను తెలియజేస్తుంది. నామినేషన్ల జాబితాను, ఎన్నికల విధానాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏఏ నియోజకవర్గానికి ఏఏ అభ్యర్థి పోటీ చేస్తున్నారో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

నిఘాస్త్రం: సీ విజిల్ యాప్

ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసీసీ) ఉల్లంఘించే వారిపై పౌర అస్త్రాన్ని ఈ యాప్ ద్వారా ఈసీ ప్రయోగించనుంది. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వారి వివరాలను ఈ యాప్‌లో పొందుపర్చేందుకు ప్రజలకు వీలు కల్పించింది. ప్రజలు ఈ యాప్‌ను తెరచి ఉల్లంఘన రకాన్ని ఫొటో, వీడియో తీసి ఎన్నికల సంఘానికి పంపొచ్చు. లోకేషన్ సమయంతో సహా పారదర్శకమైన ఫిర్యాదును ఎన్నికల సంఘం స్వీకరిస్తోంది. ఎన్నికలకు సంబంధించిన వివాదాలు, పైరవీల సైతం ఫొటో, వీడియో తీసి ఈసీకి పంపొచ్చు. ఇచ్చిన పురోగతిని ట్రాక్ చేసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

ఓట్ ఫ్రం హోమ్: సాక్ష్యం యాప్

ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్షంగా పాల్గొనలేని దివ్యాంగులకు ఈ యాప్ అత్యంత సులువైన సాధనం. దివ్యాంగులు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎన్నికల సేవలను అభ్యర్థించడానికి దోహదపడుతుంది. ఇందులో వాయిస్ టైపింగ్‌టూల్, యాక్సెస్ బిలిటీ ఫీచర్లు, పోలింగ్‌స్టేషన్‌ల సమాచారం ఉంటుంది. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు కూడా చేయొచ్చు.

ప్రచార అనుమతులకు: సువిధ యాప్

ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు తాము నిర్వహించుకునే సభలు, సమావేశాలు, ఇతర ప్రచార కార్యక్రమాలకు అధికార యంత్రాంగం నుంచి ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుంది. గతంలో అయితే మాన్యువల్‌గా రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీటికోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. వీటికి సంబంధించిన అనుమతులను సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు.

ఓటర్లకు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్

ఓటర్లకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు పబ్లిక్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. తమ ఓటు ఉందా..లేదా..ఉంటే ఏ పోలింగ్ కేంద్రంలో ఉంది, ఆ పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉంది. బూత్ లెవెల్ అధికారి ఎవరు, ఫొటో ఓటరు గుర్తింపుకార్డు(ఎపిక్) సంఖ్య వంటి ఓటరుకు అవసరమైన సమస్త సమాచారాన్ని పబ్లిక్ పోర్టల్ ద్వారా తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



పారదర్శక ఎన్నికల కోసం ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ యాప్‌లను రూపొందించింది. ఓటు ఎంత విలువైందో ఈ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు ఈ యాప్‌ల నుంచి చేసే అభ్యర్థన, ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలి. ప్రజలు సైతం ఈ యాప్‌ల ద్వారా నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహించేందుకు తమ వంతు పాత్ర పోషించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఏం జరిగినా ఈ యాప్‌లలో ఫిర్యాదు చేయొచ్చు. ప్రతి పౌరుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఒక్కో యాప్‌కి ఒక్కొక్క అధికారిని ఇన్‌చార్జిగా నియమించాం. కలెక్టరేట్‌లో వీటికి సంబంధించిన మోనటరింగ్ జరుగుతుంది.

– డాక్టర్ కె.మాధవీలత, జిల్లా కలెక్టర్

అన్నీ ఒక్కచోటే లభ్యం..

ఆండ్రాయిడ్ యూజర్లకు గూగుల్ ప్లేస్టోర్‌లో ఐవోఎస్ యూజర్లకు యాప్‌స్టోర్‌లో ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. అక్కడ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక వ్యక్తిగత ఖాతాను సృష్టించుకోవాలి. పేరు, పిన్‌కోడ్, చిరునామా, ఫోన్‌నంబర్ వివరాలను అందించాలి. ఆ తర్వాత యాప్ పనిచేస్తుంది. ఏ యాప్‌లో ఏ వివరాలు ఉన్నయో సరిచూసుకొని, వాటిల్లో లభ్యమయ్యే సమాచారంతో పాటు సేవలను వినియోగించుకోవచ్చు.



అనుమతులు తప్పనిసరి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు పూర్తి స్థాయిలో అనుమతులను అనుసరించి ప్రచారం చేపట్టాలని, ఎల్రక్టానిక్ మీడియాలో ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌ఓ జి.నరసింహులు, రాజమహేంద్రవరం పార్లమెంటు ఏఆర్‌ఓ ఆర్.కృష్ణనాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన దృష్ట్యా ఫారం 7 , 8 స్వీకరించడం నిలుపుదల చేశామని, నామినేషన్లు స్వీకరించే చివరి రోజు (ఏప్రిల్ 25) వరకు ఫారం 6ను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న జారీ చేస్తామని, 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఏప్రిల్ 26 న నామినేషన్ల స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ గడువు ఏప్రిల్ 29తో ముగుస్తుందని తెలియజేశారు. మే 13న ఎన్నికలు, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించి, జూన్ 6వ తేదీతో ఎన్నికలను పూర్తి చేస్తామన్నారు. అనంతరం సువిధా యాప్ వినియోగం పై రాజకీయ ప్రతినిధులకు పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. నమూనా ఈవీఎం పనితీరును పరిశీలించి, అక్కడ జరిగిన కార్యక్రమాలపై సమాచారాన్ని తెలుసుకున్నారు.

చంద్రబాబును ప్రజలు నమ్మరు

అమలాపురం టౌన్: గతంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఎన్నో విమర్శలు చేసిన చంద్రబాబు.. ఇప్పుడు బీజేపీతో పొత్తుపెట్టుకుని ఆయనను పొగడ్తలతో ముంచెత్తుతున్నారని రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబీ) అన్నారు. ఆయన అమలాపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రానికి మోదీ తీరని అన్యాయం చేశారని గతంలో ఆరోపించిన నోటితోనే.. ఇప్పుడు మోదీ వల్లే రాష్ట్రం అభివృద్ధి దిశలో ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. అంటే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మోదీ ఏమి చేయలేదని, ఇప్పుడు చేస్తున్నారని చంద్రబాబు చెబుతున్నారంటే పరోక్షంగా ముఖ్యమంత్రి జగన్ వల్ల అభివృద్ధి జరిగిందని ఒప్పుకున్నట్లే అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ వంటి విషయాలపై బీజేపీతో టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడగలరా అన్నారు. ఆ విషయాల్లో ముఖ్యమంత్రి జగన్ అలుపెరగని వీరుడిలా కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తున్నారన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయని విమర్శించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

- జిల్లాలో 231 సేకరణ కేంద్రాలు
- కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్

సిటీఆర్‌ఐ: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రబీ సీజన్లో ధాన్యం సేకరణపై రెవెన్యూ, పౌర సరఫరాల, వ్యవసాయ, సహకార, తూనికలు కొలతలు, రవాణా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, స్టేక్ హోల్డర్స్, కాస్టోడియన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఆర్బీకేల పరిధిలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో తీసుకునిరావాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 231 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేసి ఆ మేరకు కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో ఆరు హెక్టార్లలో కోతలు పూర్తి అయ్యాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల హెచ్చరికల వల్ల ఇబ్బందులు లేవన్నారు. ధాన్యం సేకరణలో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ కచ్చితంగా పాటించడం ముఖ్యమన్నారు. ఇప్పటి వరకు నాలుగు సీజన్లలో సేకరణ చేపట్టామని, ప్రస్తుతం ఐదవ సీజన్ కొనుగోలుకు సంబంధించి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులు, ధాన్యం సేకరణ పనులని సమాంతరంగా నిర్వర్తించాల్సి ఉంటుందనీ స్పష్టం చేశారు. జేసీ తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాలో ఈ 2023-24 రబీ లో 57,313 మంది రైతులు 132159 ఎకరాల్లో వరి పంట ఈ క్రాప్ కింద నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం 18 మండల స్థాయి సేకరణ కమిటీల ద్వారా 142 మిల్లులను గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారులను నియమించామని తెలిపారు. 2,310 మంది హమాలీలు, 355 వాహనాలను సిద్ధం చేశామన్నారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, పౌర సరఫరాల డీఎం శ్రీదేవి, డీఎస్‌వో పి.విజయ భాస్కర్ , డీఏవో ఏఎస్ మాధవరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం



వైఎస్సార్ సీపీలో చేరినవారితో మంత్రి వేణుగోపాలకృష్ణ, శ్రీనివాసులరెడ్డి

- మంత్రి వేణు
- వైఎస్సార్ సీపీలోకి 200 మంది చేరిక

రాజమహేంద్రవరం రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీశాఖామంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి బాలాజీపేట సెంటర్‌లో గొందేశి మేన్షన్‌లో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 19వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేత కుప్పిలిప్రసాద్‌తో పాటు 200మంది వైఎస్సార్ సీపీలో చేరారు. కుప్పిలిప్రసాద్, విజయ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, చరిష్మా, దివ్య, మేఘన తదితరులకు మంత్రి వేణుగోపాలకృష్ణ, గొందేశి శ్రీనివాసులరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాలకష్ణ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒకటి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు అమలు చేయలేని హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందిన వారందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోవు ఎన్నికలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరు ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మంత్రి వేణుగోపాలకృష్ణ పిలుపునిచ్చారు. రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో సేవకుడుగా సేవలందించేందుకు రావడం జరిగిందని కావున ప్రతి ఒక్కరు తనను ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాటం సుస్మిత, పడమట నాగమణి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను పోషిస్తోంది టీడీపీనే..

- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్
- నగరంలో పర్యటించిన ఎంపీ



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తోంది ముమ్మాటికీ టీడీపీకి చెందిన ఆదిరెడ్డి కుటుంబమేనని, ఈ విషయం నగరవాసులందరికీ తెలుసునని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. బుధవారం నగరంలోని 32వ డివిజన్ ఇన్‌చార్జి ముప్పన శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమీషన్ల సంస్కృతి ఆదిరెడ్డి కుటుంబానిదేనని, బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, రౌడీ షీటర్స్‌ను పెంచి పోషించేది వారి కుటుంబమేనని దుయ్యబెట్టారు. వడ్డీ వ్యాపారాలు, చిట్ల వ్యాపారాలతో ప్రజలను దోచుకుంటున్నారన్నారు. ఈ మధ్యన హైదరాబాదు గంజాయి కేసులో అడ్డంగా పట్టుబడిన జాకీ టీడీపీ కార్యకర్త ఆదిరెడ్డి వాసు అనుచరుడేనన్నారు. గంజాయి కేసులో పట్టుబడిన నేరస్తుడితో వాసుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఇటువంటి సంఘ విద్రోహక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తానని ప్రకటించారు. నగరంలో అభివృద్ధి పనులు చేయిస్తుంటే దానికీ విమర్శలేనని, 25 శాతం కమీషన్లు తీసుకుంటున్నానని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఒక్క శాతం తీసుకున్నట్టు నిరూపిస్తే నా రాజకీయాలు వదిలేస్తానన్నారు. గత ఎంపీ మురళీమోహన్ ప్రస్తుత ఎమ్మెల్యే భవాని నెగ్గిన తరువాత ప్రజలకు కనబడలేదన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు ప్రజల వద్దకు ఓట్లు అభ్యర్థించడానికి వస్తున్నారని, ఏమి చేశారని టీడీపీకి ఓటు వేయాలని ప్రశ్నించారు. నగరంలో మీ హయాంలో జరిగిన అభివృద్ధికి, తన హయాంలో జరిగిన అభివృద్ధికీ బహిరంగ చర్చకు వస్తే నేను సిద్ధమేనని ఎంపీ భరత్ టీడీపీ నేతలకు సవాల్ విసిరారు.

పార్టీ పలువురి చేరిక

నగరానికి కీర్తిప్రతిష్టలు తీసుకు రావాలనేదే తన లక్ష్యమని, అందు కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం రౌతు తాతాలు కల్యాణ మండపంలో యజ్జరపు మరిడయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు సమక్షంలో టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ చేరారు. పార్టీలో చేరిన వారిలో 29వ డివిజన్ కోఆర్డినేటర్ కురుమిల్లి శాంతి స్వరూప్, అడిషనల్ కోఆర్డినేటర్ సేపేని మునీశ్వరరావు, గూడూరి వెంకట్రావు, కిలారి శ్రీను, రాగాలు కృష్ణ, జీ వీరబాబు, పీ కామేశ్వరరావు తదితర టీడీపీ నేతలు ఉన్నారు.

రబీకి సీలేరు జలాలు విడుదల



కెనాల్ ద్వారా నీటి విడుదల

మోతుగూడెం (అల్లూరి జిల్లా): లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రాల నుంచి రబీ అవసరాలు ఉభయగోదావరి జిల్లాలకు బుధవారం నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఆదేశాల మేరకు రోజుకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వారు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు ఇంకా ఎక్కువ నీటిని విడుదల చేయాలని ఆదేశిస్తే డొంకరాయి డ్యామ్ ద్వారా విడుదల చేస్తామన్నారు. గత సంవత్సరం రబీ అవసరాలకు సుమారు 13 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు వెంకటదుర్గ

ఐ.పోలవరం: జి.వేమవరం హైస్కూల్ విద్యార్థిని బొమ్మిడి పూర్ణిమ వెంకటదుర్గ జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని హెచ్‌ఎం సలాది వెంకట నారాయణ్ బుధవారం విలేకరులకు తెలిపారు. అనంతపురంలో ఈ నెల 17న జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలలో వెంకటదుర్గ ప్రతిభ కనబరిచి, అహ్మదాబాద్‌లో ఈ నెల 26న జరిగే జాతీయ చాంపియన్‌షిప్‌కు ఎంపికై ఒదన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున తమ విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా వెంకటదుర్గను పీడి జి.కళావతి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అడ్డగళ్ల నాగ రామ ప్రసాద్, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, సర్పంచ్ నల్లా సుదర్శన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి కూలీ మృతి

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ బోడపాటి కొండతల్లి (53) అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయాన్ని ఆమె కుమారుడు బోడపాటి రాజు బుధవారం తెలిపారు. కొండతల్లి ఈ నెల 19న ఉపాధి పనులకు వెళ్లింది. తిరిగి వచ్చే సమయంలో అస్వస్థతకు గురైంది. వెంటనే కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనిపై ఏపీఓ పసుపులేటి నారాయణరావును వివరణ కోరగా కొండతల్లి మృతి చెందిన విషయాన్ని డ్వామా పీడీకి తెలియజేస్తామన్నారు.

24న బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

ఆలమూరు: స్థానిక మదర్ థెరిస్సా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ అకాడమీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో ఈ నెల 24వ తేదీన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండపేటలోని ఆశ్రమ పాఠశాలలో ఆరోజు ఉదయం ఐదు నుంచి సాయంత్రం వరకూ ఈ టెస్టింగ్ పోటీలు జరుగుతాయన్నారు. సుమారు 150 మంది హాజరవుతారని అంచనా వేస్తున్నామన్నారు. ఎల్లో, గ్రీన్, బ్లూ, రెడ్ బెల్ట్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు.

పిడుగు పడి పశువుల కాపరి మృతి



మహేష్ మృతదేహం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని టి.రాయవరంలో బుధవారం సాయంత్రం పిడుగు పడి పశువుల కాపరి మృతి చెందాడు. గ్రామానికి చెందిన పత్తేటి మహేష్ (28) పొలాల్లో పశువులను మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడింది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతి చెందగా, గ్రామానికి చెందిన కొండి సత్తిబాబు స్వల్పంగా గాయపడాడు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఊపిరి తీసిన వివాహేతర సంబంధం

- చేబ్రోలులో ఇద్దరి దారుణ హత్య
- మరొకరి పరిస్థితి విషమం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



సంఘటనాస్థలంలో తీవ్ర గాయాలతో రామలక్ష్మి



లోవమ్మ (ఫైల్)



శ్రీనివాసు (ఫైల్)

పిఠాపురం: వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలు తీసింది. మరొకరిని ప్రాణాపాయస్థితికి తీసుకెళ్లింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాసు (45), పెండ్యాల లోవమ్మ (35)లను అదే గ్రామానికి చెందిన లోకా నాగబాబు కత్తితో నరికి చంపాడు. లోవమ్మ తల్లి రామలక్ష్మిపైనా దాడి చేయడంతో ఆమె కొన ఊపిరితో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. వివరాల్లోకి వెళితే.. పెండ్యాల లోవమ్మ భర్తకు దూరంగా ఒంటరిగా ఉంటోంది. గ్రామానికి చెందిన లోకా నాగబాబుతో సహజీవనం చేస్తోంది. ఇటీవల పోసిన శ్రీనివాసుతో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. దీంతో ఆమెను నాగబాబు పలుమార్లు హెచ్చరించాడు. తన మాట వినకపోతే చంపేస్తానని బెదిరించాడు. అయినా ఆమె వినకపోవడంతో కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 20 రోజులుగా శ్రీనివాసు, లోవమ్మలను వెంబడిస్తున్నాడు. ప్రతి రోజూ శ్రీను తన మోటారు సైకిల్‌పై లోవమ్మను తన పొలంలోకి పనులకు తీసుకెళ్లడం గమనించాడు. ఎలాగైనా వారిద్దరినీ చంపాలని నిర్ణయించుకున్నాడు.

మాటు వేసి దాడి

లోకా నాగబాబు మంగళవారం అర్ధరాత్రి చేబ్రోలు శివారు లక్ష్మీపురం పొలిమేరలో ఉన్న శ్రీనివాసు పొలానికి కత్తి తీసుకుని వెళ్లాడు. తన మోటారుసైకిల్‌ను దూరంగా పొదల్లో దాచాడు. అక్కడ బెండ తోట పక్కనే ఉన్న నువ్వుల చేనులో దాకున్నాడు. కాగా.. శ్రీనివాసు తన పొలంలో బెండకోత కోసం నలుగురు కూలీలను మాట్లాడుకుని బుధవారం ఉదయం 4.30 గంటలకు వారిని రమ్మని చెప్పాడు. ముందుగానే లోవమ్మను తీసుకుని పొలానికి వెళ్లిపోయాడు. అక్కడే నువ్వుల చేలో దాక్కున్న నాగబాబు వారిద్దరిపై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అనంతరం లోవమ్మ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఆమె తల్లి రామలక్ష్మిపై కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు విని స్థానికులు అక్కడకు వచ్చేసరికే నాగబాబు పరారయ్యాడు. కాగా.. బెండ కాయల కోతకు వచ్చిన కూలీలు పొలంలో లోవమ్మ, శ్రీనివాసు మృతదేహాలను చూశారు. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోసిన శ్రీనివాసుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. లోవమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాగబాబు గత 20 రోజులుగా కత్తి తీసుకుని శ్రీనివాసు పొలంలో తిరగడాన్ని సమీపంలోని రైతులు గమనించారు. ఈ విషయాన్ని శ్రీనివాసుకు చెప్పినా అతడు పట్టించుకోలేదు. నాగబాబు గతంలో లోవమ్మ వెంటబడిన ఒక వ్యక్తి చెయ్యి నరికాడని, ఈ ఘటనపై పోలీసులు కేసు కూడా నమోదు చేశారని స్థానికులు తెలిపారు. అడిషనల్ ఎస్పీ భాస్కరరావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం: ర్యాలి గ్రామంలోని మిద్దే భాగ్యలక్ష్మి ఇంటిలో ఈ నెల 12వ తేదీన 32 గ్రాముల బంగారం చోరీకి గురైంది. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన వెంకట్రావు పల్లపురాజును బుధవారం అరెస్టు చేసి, అతడిని నుంచి బంగారం రికవరీ చేసినట్టు ఎస్సై తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచామన్నారు.

బెండపూడి చెక్‌పోస్టు నిలిపివేత

తొండంగి: దేశవ్యాప్తంగా జీఎస్టీ అమలు చేసిన నేపథ్యంలో అంతర్రాష్ట్రీయంగా బెండపూడి జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న రవాణా శాఖ చెక్‌పోస్టు సేవలను నిలిపివేశారు. కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పోస్టులను నిలిపివేస్తూ జీఓ 24 ద్వారా ఈనెల 15న ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు బెండపూడిలో చెక్‌పోస్టు వద్ద సేవలను రవాణాశాఖ అధికారులు సేవలు నిలిపివేశారు. వాహనాల టెంపరరీ పర్మిట్లకు సంబంధించి ఆన్‌లైన్ యాప్ ద్వారా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రైస్‌మిల్లులో ఇద్దరు మహిళా కూలీల మృతి



లలితా రైస్‌మిల్లులో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సురేష్

పెద్దాపురం: రైస్‌మిల్లులో కూలి పనికి వెళ్లిన ఇద్దరు మహిళలు లారీ ఢీకొని మృతి చెందారు. పెద్దాపురం మండలం వాలు తిమ్మాపురం రహదారిలోని లలితా రైస్‌మిల్లులో బుధవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. పెద్దాపురంలోని రాజీవ్ కాలనీకి చెందిన కామిశెట్టి కామేశ్వరి (51), మండలంలోని కట్టమూరుకు చెందిన మోతుపల్లి నాగరత్నం (65) బుధవారం ఉదయం రైస్‌మిల్లులో పనికి వెళ్లారు. రోజూ మాదిరిగానే శుభ్రం చేస్తుండగా వర్షం పడుతుండడంతో మిల్లులోని గోడ పక్కన నిలబడ్డారు. ఈలోపు వర్షం కారణంగా లారీని డ్రైవర్ వెనకకు నడుపుతున్న క్రమంలో గోడ పక్కన నిలబడిన మహిళలను వెనుక నుంచి బలంగా ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన వారిని యాజమాన్యం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. మృతురాలు నాగరత్నానికి నలుగురు కుమారులు. ఒంటరిగా పింఛన్ సొమ్ముతో జీవిస్తూ రైస్‌మిల్లులో కూలికి వెళుతోంది. కామేశ్వరికి భర్త లేడు. రైస్ మిల్లులో కూలి పని మీద ఆధారపడి బతుకుతోంది. ఈ ఘటనపై ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ. 93.10 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.93,10,393 వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. 28 రోజులకు ప్రధాన హుండీల నుంచి రూ.71,44,868 అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.21,65,525 లభించిందన్నారు. విదేశీ కరెన్సీతో పాటు 40 గ్రాముల బంగారం, కేజీ వెండిని భక్తులు హుండీల్లో వేశారన్నారు. ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ 2,36,159 సమకూరినట్టు తెలిపారు. కాగా.. హుండీలో పువ్వులు, తులసి మాలలు వేయడంతో కరెన్సీ నోట్లు పాడవుతున్నాయని భక్తులు గమనించాలని కోరారు. లెక్కింపు కార్యక్రమం పర్యవేక్షణ అధికారిగా కోనసీమ జిల్లా డీఈఓ, అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఈవో ఎం.రాధాకృష్ణ, గోపాలపురం ఆలయ ఈఓ బి.కిరణ్, ఆత్రేయపురం ఈఓ బి.నరేంద్రకుమార్ వ్యవహరించారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నరసన్న కల్యాణం.. కన్నుల వైభవం

- ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం
- అంతకు ముందు రథోత్సవం
- తరలివచ్చిన భక్తులు



కోరుకొండలో లక్ష్మీనరసింహస్వామి వారి రథోత్సవం

మధురపూడి: కోరుకొండలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో స్వామివారి కల్యాణ మంటపంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణ క్రతువు నిర్వహించారు. పండితుడు పాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్యులు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఎస్వీ రంగరాజ బట్టర్, అర్చక స్వాములు పెద్దింటి, పెదపాటి పర్యవేక్షణలో వేడుక జరిగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజశ్రీ దంపతులు, వైఎస్సార్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా రథోత్సవం

కల్యాణోత్సవానికి ముందు మధ్యాహ్నం 1.58 గంటలకు స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. తొలుత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించిన అనంతరం రథంపై ఆశీనులు చేశారు. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ రథాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రారంభించారు. కొండ దగ్గర నుంచి దేవస్థానం రోడ్డు, సుజలా డ్రింకింగ్ వాటర్ ప్లాంట్, రెడ్డి పంతులు సత్రం, పాత సంత మార్కెట్, వడ్డీల పేట, మత్స్యకారుల వాడ, ఎయిర్ టెల్ టవర్, సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, శివాలయం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నృత్యం, బ్యాండ్ మేళాలు, కోలాటం, తీన్ మార్, శక్తి వేషధారణలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. రథం దేవస్థానానికి చేరుకోగానే ఎదుర్కోలు కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో నరసింహస్వామి, లక్ష్మీదేవిని ఆలయంలోకి తీసుకెళ్లారు. కాగా.. జోరున వర్షం పడుతున్నా భక్తులు ఉత్సాహంగా రథోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, సంక్షేమ పాలనను అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ సీఎంగా అవకాశం కల్పించాలని స్వామివారిని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, డీసీ రమేష్‌బాబు, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీజేపీ రాష్ట్ర నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, డీఎస్పీ కె.శ్రీనివాసులు, సీఐ అడపా నాగమురళీ, ఎస్సై ఆనంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా



నరసింహస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

వ్యక్తి అదృశ్యం

అయినవిల్లి: తొత్తరమూడి గ్రామంలోని మాగాపువారి పేటకు చెందిన గెద్దాడ శ్రీనివాసరావు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం పెళ్లి భోజనానికి అమలాపురం మండలం వేమవరం వెళ్లాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. దీనిపై అతని కుమారుడు సతీష్‌కుమార్ బుధవారం అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై బి.రాజేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు-ఆటో ఢీ

ముగ్గురికి గాయాలు



చొల్లంగి వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జయిన ఆటో

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి వద్ద బుధవారం రాత్రి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల మేరకు, యానాం నుంచి కాకినాడ వైపు వెళుతున్న ఆటోను, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదం ధాటికి ఆటో నుజ్జయింది. ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇలాఉండగా ఈ సంఘటనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుకిరువైపులా సుమారు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోరంగి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

పశువుల బీమాకు రాయితీ



పినపళ్లలో పశువుల ఆస్పత్రి రికార్డులను పరిశీలిస్తున్న మూర్తి

ఆలమూరు: పశు బీమా పథకం ద్వారా పశువులు, మేకలు, గొర్రెలకు రాయితీ అమలు చేస్తున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కర్నీడి మూర్తి తెలిపారు. పినపళ్ల పశు వైద్యశాలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పశువులకు రూ.30 వేల బీమా చేయడానికి రైతు తమ వాటాగా రూ.394 చెల్లిస్తే, ప్రభుత్వం రూ.1,536 తమ వాటాగా అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పశువులకు హెల్త్ కార్డులు మంజూరు చేశామన్నారు. జిల్లాలోని పశువులకు సుమారు 50 వేల హెల్త్ కార్డులు మంజూరు కాగా, ఇప్పటివరకూ 90 శాతం కార్డులు పంపిణీ పూర్తి చేశామన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలు జిల్లాలో 95 శాతం పూర్తి చేశామన్నారు. తమ పశువులకు టీకాలు వేయించుకోలేని పాడి రైతులు.. సమీపంలోని పశువుల ఆస్పత్రికి వెళ్లి పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పశు వైద్యశాల రికార్డులను తనిఖీ చేశారు. పశు వైద్యాధికారి ఈదల శ్రీనివాస్ చౌదరి ఉన్నారు.

మదరసా.. భవితకు భరోసా

- ముస్లిం బాలలకు హాఫిజ్ శిక్షణ
- ఇంగ్లిష్, ఉర్దూ, అరబ్బీలపై అవగాహన
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆరు మదరసాలు

కొత్తపేట: ముస్లిం బాలలకు ఖురాన్ పఠనంతో పాటు ఉర్దూ, ఇంగ్లిషు భాషలతో విజ్ఞాన సముపార్జనకు మదరసాలు దోహదపడుతున్నాయి. పేదల పిల్లలు, అనాథ బాలలు, బాల కార్మికులుగా మగ్గుతున్న పిల్లలకు ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నారు. వారికి విద్యాబుద్ధులు చెప్పించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఇవి పనిచేస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం అర్బన్‌లో ఒకటి, రూరల్‌లో రెండు, కాకినాడ అర్బన్, సఖినేటిపల్లి, రావులపాలెంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఆరు రిజిస్టర్డ్ మదరసాలు ఉండేవి. అయితే రావులపాలెం మదరసా కోవిడ్‌లో లాకౌట్ అయ్యింది. ఇవి కాకుండా సుమారు రెండేళ్ల క్రితం కొత్తపేట మండలం పలివెలలో ఒక మదరసా ఏర్పడింది. అక్కడ 19 మంది, పై ఐదు సెంటర్లలో 266 మందితో మొత్తం 285 బాలలు శిక్షణ పొందుతున్నారు. రాజమహేంద్రవరం అర్బన్ సెంటర్‌లో ప్రత్యేకంగా 46 మంది బాలికలు శిక్షణ పొందుతున్నారు.

బాలలకు శిక్షణ

మదరసాల్లో ఉర్దూ, అరబ్బీ, ఇంగ్లిషు భాషలకు సంబంధించి బాలలకు నజీమ్‌లు శిక్షణ ఇస్తారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, సెకండరీ స్థాయిల్లో శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణలో ముఖ్యంగా ఖురాన్‌లో 30 భాగాలు ఉంటాయి. పిల్లల మేధస్సు, తెలివితేటలను బట్టి రెండు నుంచి నాలుగు ఏళ్లలో శిక్షణ పూర్తవుతుంది. ఈ శిక్షణానంతరం ఉర్దూ ఉపాధ్యాయ అభ్యర్థులుగా, హాఫిజ్ (ఖురాన్ చూడకుండా చదవడం)పై అర్హత సాధిస్తారు. ఆయా మదరసాల ద్వారా సర్టిఫికెట్ పొందుతారు. దాని ద్వారా మసీదుల్లో ఇమామ్ (మత గురువు)గా ప్రార్థనలు చేయడానికి కూడా అర్హులవుతారు. ఉదాహరణకు కొత్తపేటకు చెందిన జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మహ్మద్ హరుణ్ కుమారుడు మహ్మద్ సల్మాన్ బెంగళూరులో రెండేళ్లు ఖురాన్ హాఫిజ్ శిక్షణ పొంది, మసీదు ఇమామ్‌గా అర్హత సాధించారు. సుమారు రెండేళ్లుగా నడుస్తున్న కొత్తపేట మండలం పలివెల మదరసాలో 21 మంది విద్యార్థుల్లో ఇద్దరు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసి వారి స్వగ్రామాలకు వెళ్లారు.

దాతల సహకారంతో..

ఈ మదరసాలు దాదాపు దాతల సహకారంతో నడుస్తున్నాయి. ధనిక ముస్లింలు ఏడాదికి ఒకసారి తమ సంపాదనలో జకాత్ (రూ.లక్షకు రూ.రెండున్నర వేలు చొప్పున) ఇస్తారు. ఆ మొత్తంలో కొంత భాగం మదరసాలకు కేటాయిస్తారు. అలా మదరసాలు నడుస్తున్నాయి. పలివెల మదరసాలో శిక్షణ పొందుతున్న బాలల్లో ఎక్కువ మంది పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారే. వారికి దుబాయ్‌లో స్థిరపడిన మండపేట వాసి షేక్ జమీర్, కొత్తపేట మసీదు, షాదీఖానా కమిటీ ప్రెసిడెంట్ షేక్ ఖాజాబాబు తదితర దాతలు సహకరిస్తున్నారని పలివెల మసీదు ఇమామ్ మహ్మద్ అబ్దుల్లా ఖాదిరీ హబీబీ తెలిపారు.



కొత్తపేట మండలం పలివెల మదరసాలో బాలలకు శిక్షణ ఇస్తున్న ఇమామ్ మహ్మద్ అబ్దుల్లా ఖాదిరీ

రెండేళ్లలో హాఫిజ్ అర్హత సాధించాను



కొత్తపేటలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఐదోతరగతి వరకూ ప్రాథమిక విద్య అభ్యసించాను. తర్వాత రెండేళ్లు రాజమహేంద్రవరం సమీపంలోని కొంతమూరు మదరసాలో చదివాను. తరువాత బెంగళూరు దారుల్ ఉలూకు సబీల్ రషాద్ అనే సంస్థలో ఉర్దూ, అరబిక్‌తో పాటు ఖురాన్ పఠనం చేశాను. ఖురాన్‌ను చూడకుండా చదవటంలో హాఫిజ్‌గా అర్హత సాధించాను. ఖురాన్‌లో 30 భాగాలను అలవోకగా చదువుతూ దానిలో అర్థాన్ని, పరమార్థాన్ని వివరించగలను. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను.

– మహ్మద్ సల్మాన్, హాఫీజ్, కొత్తపేట

బలోపేతానికి కృషి



అనాథ, పేద పిల్లలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దే మదరసాలను బలోపేతం చేసేందుకు వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా నా వంతు కృషి చేస్తా. అనాదిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో రిజిస్టర్డ్ మదరసాలుగా నడిచే ఈ సంస్థల బాగోగులను బీజేపీ నాయకత్వంలో ఎన్‌డీఏ ప్రభుత్వం గాలికొదిలేసి నిర్వీర్యం చేసింది. ఈ మదరసాల విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వాటికి ప్రత్యేక నిధులు కేటాయించి, మరింతమందికి అన్ని సౌకర్యాలతో కూడిన శిక్షణ ఇప్పించేలా కృషి చేస్తా.

– షేక్ అబ్దుల్ ఖాదర్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం చర్యలు



మదరసాలో విద్యను అభ్యసించే అనాథ, పేద పిల్లలకు ధార్మిక విద్యతో పాటు మోడరన్ ఎడ్యుకేషన్, ఉన్నత చదువులకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దానిలో భాగంగా మదరసా బోర్డు ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకురాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఈ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ఎక్కడ మంచిపేరు వస్తుందోనని కొందరు రాజకీయ నాయకులు అడ్డుపడ్డారు. నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిన సీఎం జగన్ మదరసాల అభివృద్ధికి ధృడ సంకల్పంతో ఉన్నారు.

– షేక్ అజహర్, మదరసా యూనియన్ నాయకుడు, రావులపాలెం